

విద్యార్థులకు ఉపయోగపడేలా వెబ్‌సైట్ : విసి

కడప అర్బన్ : పరిశోధకులకు, విద్యార్థులకు ఉపయోగపడేలా యోగివేమన విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ ఉండాలని విసి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యతో కలిసి విశ్వవిద్యాలయ ఐటిసెల్ సంచాలకులు ఆచార్య ఎం.వి. శంకర్ ఆధ్వర్యంలో రూపకల్పన చేసిన బయో కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, జంతు శాస్త్ర శాఖ విభాగాల వెబ్‌సైట్‌ను ఆచార్య చింతా సుధాకర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ మూడు శాఖలు పరిశోధన పరంగా అకడమిక్‌గా ఎల్లప్పుడూ ముందుండేలా కృషి చేయాలన్నారు. ఐటి సెల్ సంచాలకులు ఆచార్య ఎన్.వి. శంకర్ మాట్లాడుతూ వైవీయూ ఫ్యాకల్టీ రాసిన స్కోపస్, యు జి సి కేర్ లిస్ట్ జర్నల్స్ ఐటీ సెల్ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డి, ఆచార్య చంద్రమతి శంకర్, డాక్టర్ వెంకట్రామిరెడ్డి, ప్రజా సంబంధాల విభాగం సంచాలకులు డాక్టర్ ఎస్ వి సుబ్బారెడ్డి, విశ్వవిద్యాలయం ఇంజనీర్ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

సా..గుతున్న సహకారం



జిల్లాలో వ్యవసాయ రుణాల మంజూరు ప్రక్రియ మందకొడిగా సా..గుతోంది. జిల్లా కో-ఆపరేటివ్ సహకార బ్యాంకు ఆదేశాలతో ప్రాథమిక సహకార సంఘాలు పకడ్బందీగా రైతు రుణ పంపిణీకి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఖరీఫ్ సీజన్ పంటల సాగుకు అవసరమైన రుణాలను జూన్, జులై మాసాల్లో మంజూరు చేయాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై సుమారు నెల రోజులు గడుస్తున్నప్పటికీ 20 శాతమే రుణాలను మంజూరు చేయడం ఆందోళన కలిగిస్తోంది. జులై నెలాఖరు నాటికి పంటల సాగు ముగియనున్న నేపథ్యంలో మిగిలిన 80 శాతం లక్ష్యాన్ని అధిగమించాల్సి ఉంది. నెల రోజుల వ్యవధిలో ఇంతటి భారీ లక్ష్యాన్ని అధిగమించడంపై సందేహాలు నెలకొన్నాయి.

రూ.500 కోట్లు రుణాలు కేటాయింపు
నేటికి 20 శాతమే రుణ పంపిణీ
ఆందోళనలో జిల్లా రైతాంగం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

2023-24 ఖరీఫ్ సీజన్‌లో రూ.500 కోట్ల వ్యవసాయ రుణాలను పంపిణీ చేయాలనే లక్ష్యాన్ని జిల్లా కో-ఆపరేటివ్ సహకార బ్యాంకు జిల్లా యంత్రాంగం నిర్దేశించుకుంది. ఉమ్మడి కడప జిల్లాలోని 72 ప్రాథమిక సహకార పరపతి సంఘాలకు ఆదేశాలు జారీ చేసింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్న నేపథ్య ంలో రూ.100 కోట్ల రుణాలను మాత్రమే పంపిణీ చేసింది. ఈలెక్కన 20 శాతం రుణాలను మాత్రమే మంజూరు చేసినట్లు తెలుస్తోంది. మిగిలిన 80 శాతం రుణాలను జులై నెలాఖరు నాటికి మంజూరు చేయాల్సి ఉంది. ఖరీఫ్ ఆలస్యమైన నేపథ్యంలో రైతాంగం వ్యవసాయ రుణాల సేకరణపై పూర్తిస్థాయి దృష్టి సారించింది. ఇటువంటి పరిస్థితుల్లో 20 శాతం మంజూరు చేయడంపై ఆందోళన నెలకొంది. వర్షాలు ఊపందుకున్న నేపథ్యంలో రైతాంగం పంటల సాగుపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించనుండడం తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల్లో పూర్తిస్థాయిలో వ్యవసాయ రుణాల మంజూరు చేయడంపై సందేహం నెలకొంది.

బుక్‌అడ్జస్ట్‌మెంట్లే శరణ్యమా?

ఉమ్మడి జిల్లాలోని 72 ప్రాథమిక సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. కడప జిల్లాలోని 47 ప్రాథమిక సహకార సంఘాలు, అన్నమయ్య జిల్లాలోని 25 ప్రాథమిక సహకార సంఘాల పరిధిలోని 72 వేల మంది రైతులకు రుణాల పంపిణీ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఆలస్యంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు పంటల సాగుపైనే దృష్టి కేంద్రీకరించారు. ఫలితంగా డిసిసిబి అధికారులు సుమారు 40 వేల మంది రైతుల రుణాలు బుక్ అడ్జస్ట్‌మెంట్ పరిధిలోకి వెళ్లే అవకాశాలు ఉన్నాయనే వాదన రైతు సంఘాల నాయకుల నుంచి వినిపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో బుక్‌అడ్జస్ట్‌మెంట్ బారిన పడిన రైతాంగం ప్రయివేటు వడ్డీ వ్యాపారాలను ఆశ్రయించే అవకాశాలు పుష్కలముగా ఉన్నాయనడంలో సందేహం లేదు.



రైతులకు తప్పని తిప్పలు

ఖరీఫ్ సీజన్ ఆలస్యంగా సాగైన నేపథ్యంలో రైతాంగం పంటల సాగు చేయడంపైనే దృష్టి సారించడం తెలిసిందే. డిసిసిబి అధికార యంత్రాంగం నిబంధనల్ని కఠినతరం చేసిన నేపథ్యంలో రైతులు రుణాల మంజూరుకు సంబంధించిన అడంగల్, ఒన్‌బి, ఇసి మొదలగు పత్రాల సేకరణకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగడానికి సమయం దొరకని పరిస్థితి. రైతు రుణాలను మంజూరు చేయడానికి రైతుల దగ్గర నుంచి సేకరించిన ఇసి, అడంగల్, ఒన్‌బి, మార్ట్‌గేజ్ మొదలగు అంశాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం రుణాలను మంజూరు చేస్తోంది. జిల్లా రుణ పరపతి కమిటీ ఆమోదించిన మేరకు పంటలను బట్టి రుణాలను మంజూరు చేస్తోంది. సాగుకు సరిపడా రుణాలు మంజూరు కావడం లేదనే వాదన రైతు సంఘాల నాయకుల నుంచి వినవస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో మిగిలిన 80 శాతం రుణ పంపిణీ చేయడం సవాలుగా మారే అవకాశం ఉందనడంలో సందేహం లేదు.

రుణ పంపిణీని వేగవంతం చేయాలి

సహకార రుణ పంపిణీని వేగవంతం చేయాలి. ఖరీఫ్ సీజన్ నెల రోజుల్లో 20 శాతమే పంపిణీ చేయడం ఆందోళన కలిగిస్తోంది. ఫలితంగా రైతులు సంబంధిత పత్రాలను అందజేయని నేపథ్యంలో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించే అవకాశం ఉంది. జిల్లా అధికార యంత్రాంగం బుక్‌అడ్జస్ట్‌మెంట్లకు పరిమితం గాకుండా వంద శాతం రుణాలను మంజూరు చేయాలి. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవు

- దస్తగిరిరెడ్డి, జిల్లా కార్యదర్శి, ఎపి రైతు సంఘం, కడప.

లక్ష్యాన్ని అందుకుంటాం

ఖరీఫ్ సీజన్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఫలితంగా జులై, ఆగస్టు మాసాల్లోనూ రుణాలు మంజూరు చేయవడానికి అవకాశం లభించింది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో మిగిలిన 80 శాతం లక్ష్యాన్ని అందుకుంటాం.

- రాజేంద్రకుమార్, డిసిసిబి, సిఇఒ, కడప.

అన్ని రంగాల్లో వెనుకబడిన రాష్ట్రం

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్

ప్రజాశక్తి -బద్వేలు

రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి వెనుకబడిపోయిందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడుతూ తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాలలో వెనుకబడి ఉందని తెలిపారు. కేంద్రంలోని బిజెపి రాష్ట్ర విభజన హామీలలోని ప్రత్యేక హోదా, రైల్వే జోన్, కడప ఉక్కు పరిశ్రమ, పోలవరం ప్రాజెక్టు లాంటివి ఏ ఒక్కటి కూడా పూర్తి చేయలేదన్నారు. అలాంటి బిజెపికి రాష్ట్రంలోని టిడిపి, వైసిపి, జనసేన మద్దతుగా నిలబడడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ మూడు పార్టీలు సొంత ప్రయోజనాల కోసం రాష్ట్రాభివృద్ధిని తాకట్టు పెట్టాయని పేర్కొన్నారు. బిజెపి అంటే బాబు, జగన్, పవన్ అని అర్థం వచ్చేలా బిజెపి విధానాలకు వంత పాడుతున్నారని, రాష్ట్ర ప్రయోజనాలను గాలి కొదిలేసారని, భవిష్యత్ తరాలు వీరిని క్షమించవని పేర్కొన్నారు. రాబోయే కాలంలో విభజన హామీలను అమలు చేసుకునేందుకు సిపిఎం ఆధ్వర్యంలో సమావేశాలు పోరాటాలు, ఉద్యమాలు చేస్తామని తెలిపారు. దేశ ప్రజలలో ఐక్యతను దెబ్బతీసేలా బిజెపి నాయకుల మాటలు, పరిపాలన తీరు ఉన్నాయని తెలిపారు. ఇది ఇలానే కొనసాగితే భవిష్యత్తులో బిజెపి తన ప్రతిష్టను క్రమక్రమంగా కోల్పోయి దేశంలో అధికారం కోల్పోతుందని జోష్యం చెప్పారు. మైనార్టీలను, క్రైస్తవులను వ్యతిరేకిస్తూ పోతే బిజెపి కర్ణాటక రాష్ట్రంలో ఓడిపోయినట్లుగానే ఇతర రాష్ట్రాలలో కూడా ఓడిపోతుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఐ.ఎన్.సుబ్బమ్మ, సిఐటియు నాయకులు శ్రీనివాసులు, నాగేంద్ర, సిపిఎం నాయకులు దస్తగిరి, రామ్మోహన్, శివకుమార్, మనోహర్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కడప జిల్లా ప్రొద్దుటూరులోని శ్రీ రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో పాలిటెక్నిక్ తృతీయ సంవత్సరం చదువుతున్న సానియా అనే విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలలోకి వెళితే...మంగళవారం కడప నగర శివారులోని ఆలంఖాన్‌పల్లెకు చెందిన ఆమె ప్రతి రోజూ కళాశాలకు వస్తూ పోతూ ఉంటుంది. మంగళవారం కూడా కళాశాలకు వచ్చింది. మంగళవారం ఉదయం కళాశాల భవనం రెండో అంతస్తు నుంచి ఆమె దూకి ఆత్మహత్యకు ప్రయత్నించింది. ప్రేమ వ్యవహారంలో మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు సమాచారం. విదార్థి కాళ్లు, తలకు బలమైన గాయాలయ్యాయి. కళాశాల సిబ్బంది హుటాహుటిన విద్యార్థిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. ప్రభుత్వ ఆసుపత్రికి ఎఎస్‌పి ప్రేరణ కుమార్, టూటౌన్ సిఐ ఇబ్రహీం చేరుకొని ఘటనకు కారణాలపై ఆరా తీశారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సానియాతో మాట్లాడుతున్న సిఐ

విద్యార్థినికి న్యాయం చేయాలి : ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ

లింగాపురం పరిధిలోని ఎస్ఆర్ఐటి కళాశాలలో ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన విద్యార్థినికి వైద్య ఖర్చులు పూర్తిగా కాలేజీ యాజమాన్యం భరించాలని, జరిగిన సంఘటనపై సమగ్ర విచారించాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ విద్యార్థి, యువజన సంఘం నాయకులు తెలిపారు. మంగళవారం వారు కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సునీల్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఆర్ఎస్ఓ అధ్యక్షులు జగన్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బా.నరసింహులు మాట్లాడుతూ ఎస్ఆర్ఐటి కళాశాలలో జరిగిన సంఘటన విచారకరమన్నారు. విద్యార్థిని ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన సంఘటనపై సమగ్ర విచారణ చేసి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

పిల్లలు సత్ప్రవర్తనతో మెలగాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్

పిల్లలు సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఎ సెక్రటరీ ఎం. ప్రదీప్ కుమార్ అన్నారు. మంగళవారం కడప నగరంలోని చిన్న చౌక్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను జడ్జి సందర్శించారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పిల్లలకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని సూచించారు. వంట, వసతి, తరగతి గదులను పరిశీలించారు. పిల్లల విద్యా , ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


జీతాల చెల్లింపులపై ఆర్‌జెడికి వినతి

కడప అర్బన్ : ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయ బదిలీల్లో వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల జీతాలు ఆలస్యం చేయకుండా వెంటనే చెల్లించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వెంకట కృష్ణారెడ్డి ని కోరారు. మంగళవారం ప్రగతి భవన్ లోని ఆర్జెడి కార్యాలయంలో ఆయన్ను కలిసి సమస్యలపై వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 138 మంది విద్యార్థుల కన్నా తక్కువ ఉన్న ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల పోస్టులు రద్దు చేశారని తెలిపారు. ఆ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల జీతభత్యాలు చెల్లించడంలో సందిగ్ధత ఏర్పడిందని చెప్పారు. ఇటీవల పీజీటీగా ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నుంచి ఎంఇఒ-2గా వెళ్లారని వారికీ జీతాలు చెల్లించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వాటిని వీలైనంతగా త్వరగా పరిష్కరించాలని కోరారు కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు వై. రవికుమార్, ట్రెజరర్ నరసింహారావు, కార్యదర్శి ఏజాస్ అహ్మద్, నాయకులు సుబ్బారెడ్డి, వీరనారాయణ, పార్థసారథి, నాగరాజు, కరిముల్లా, అనిల్ కుమార్, మహమ్మద్ రిజ్వాన్ పాల్గొన్నారు.

రాయలసీమకే గర్వకారణం చదువుల బాబు

ప్రజాశక్తి - కడప అర్బన్

సుప్రసిద్ధ బాల సాహితీవేత్త డికె చదువుల బాబుకు 2023 గాను బాల సాహిత్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం రావడం రాయలసీమకే గర్వకారణమని అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య అన్నారు. ప్రస్తుతం చదువుల బాబు తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న కమలాపురం మండలంలోని పెద్దచెప్పలి ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు ఓబులరెడ్డి అధ్యక్షతన అభినందన సభ మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ తవ్వా వెంకటయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొట్టమొదటిసారి రాయలసీమకు బాల సాహిత్యంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం రావడం గర్వకారణం అన్నారు. వైవీయూ ప్రొఫెసర్ ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ జిల్లాకు చెందిన చదువుల బాబుకు అలాగే జిలాన్ బాషకు సాహిత్య విమర్శకు సంబంధించి కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం రావడం జిల్లా సాహితీ మిత్రులందరికీ దక్కిన గౌరవమన్నారు. పెద్ద చెప్పలి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసంగిస్తూ చదువుల బాబు వంటి గొప్ప సాహితీ వేత్తతో కలిసి పనిచేస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చదువులబాబును సన్మానిస్తున్న తవ్వా వెంకటయ్య, మూల మల్లికార్జునరెడ్డి

ప్రయివేట్ దోపిడీ అరికట్టాలని ఆందోళన

కడప అర్బన్ : జిల్లాలో కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలను కట్టడి చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్‌జెడి కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీకి గురి చేస్తున్నారని విమర్శించారు. పాఠశాలల్లో పుస్తకాలు అమ్మవద్దని నిబంధన ఉన్నా లెక్కచేయకుండా యథేచ్ఛగా విక్రయిస్తున్నారని వాపో యారు. అనంతరం ఆర్‌జెడి కృష్ణా రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు అన్న మయ్య జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఉర్దూ భాష లేకపోవడం శోచనీయం

కడప అర్బన్ : నగరంలో రెండవ అధికార భాష ఉర్దూను అమలు చేయాలని జెకె యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు ఖాదర్‌బాష కోరారు. మంగళవారం 50వ డివిజన్‌లో వీధి పేరుతో ఉన్నబోర్డులో ఉర్దూ భాష లేకపోవడాన్ని ఆక్షేపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి, డిప్యూటీ సిఎం జిల్లా వాసులుగా ఉన్నారని, వీరి జిల్లాలో రెండవ అధికార భాష అమలు కాకపోవడం బాధకరని తెలిపారు. నగరపాలక సంస్థ వీధి బోర్డులో ఉర్దూ భాష అమలు అయ్యేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

వైద్యులను గౌరవించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

వైద్యులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని టిడిపి నగర ఉపాధ్యక్షులు కొండ సుబ్బయ్య పేర్కొన్నారు. ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే పుర స్కరించుకుని మంగళవారం ఎంఎం హాస్పిటల్‌లో ప్రముఖ కంటి వైద్య నిపుణులు ఎస్. ఎం. ఆసిఫ్‌ని మెమోంటో, శాలువాతో సత్కరి ంచారు. ఈ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడుతూ డాక్టర్ ఆసిఫ్‌తో పాటు వారి తండ్రి, కుటుంబం పూర్తిగా వైద్య సేవలకు అంకితమై ప్రజాసేవ చేయడం అభినందనీయమన్నారు.

దూర విద్య పరిశీలన

ప్రజాశక్తి- కడప అర్బన్

వైవీయూలో దూర విద్యా కోర్సులు ప్రారంభానికి వర్చువల్ విధానంలో డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బోర్డు సమావేశం నిర్వహించారు. విసి చింతా సుధాకర్ దూర విద్య ప్రారంభానికి సానుకూలంగా స్పందించారు. డిస్టెన్స్ ఎడ్యుకేషన్ వైవీయూ డైరెక్టర్ కృష్ణారెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా దూర విద్య కోర్సుల నిర్వహణకు అవసరమైన సిలబస్, అధ్యాపకులు, మౌలిక వసతులు వివరించారు.

డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తాం : ఎమ్మెల్యే

పోరుమామిళ్ల టౌన్ : మురుగునీరు రోడ్డుపై నిల్వ ఉండకుండా డ్రెయినేజీ వ్యవస్థనుఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ సుధా పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని పులివీడు దళితవాడలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో మునీటి సమస్యను పరిష్కరించి తాగునీటి బోరు వేయిస్తామన్నారు. గ్రామంలోని ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామని చెప్పారు. ఆమె వెంట పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సలహాదారు పి. నాగార్జున రెడ్డి, జడ్‌పిటిసి ముత్యాల ప్రసాద్, మండల ఉపాధ్యక్షులు సి. బాష, చెన్ను రాజశేఖర్, పులివీడు గ్రామపంచాయతీ సర్పంచ్ రఘునాథరెడ్డి, వెంకటరెడ్డి, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టి మాఫియాను అరికట్టాలి

ఒంటిమిట్ట : మండలంలోని గంగపేరూరు వద్ద ఉన్న చిన్న చెరువులో కొన్ని రోజులుగా అక్రమంగా మట్టి తరలిస్తున్నారని, మాఫియాను అరికట్టాలని రాజంపేట తెలుగుదేశం పార్టీ నియో జకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్ రాయుడు అన్నారు. మట్టి మాఫి యాపై తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయడానికి మంగళవారం ఉదయం స్థానిక రెవెన్యూ కార్యాలయానికి టిడిపి నాయకులతో కలిసి వెళ్లారు. తహశీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం డిటి అయూబ్‌ఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొన్ని రోజులుగా గంగ పేరూరు వద్ద ఉన్న చిన్న చెరువులో మట్టి తోలుకునేందుకు ప్రభుత్వం ఒక జెసిబి,6 ట్రాక్టర్లకు పర్మిషన్ ఇస్తే రెండు జెసిబిలు 20 ట్రాక్టర్లు పెట్టి యథేచ్ఛగా బట్టీలకు అక్రమ రవాణా చేస్తున్నారని వాపోయారు. పంట పొలాలకు పర్మిషన్ తీసుకుని ఇటుక బట్టీలకు అమ్ముకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఒక ట్రాక్టర్ మట్టి రూ.1600 వరకు అమ్ముకుంటూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారని వాపోయారు. ఇప్పటికైనా రెవెన్యూ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని, లేకపోతే ప్రతిఘటిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

డాక్టర్ పల్లా భాస్కర్‌కు మాతృ వియోగం

ప్రజాశక్తి - కడప



నివాళులర్పిస్తున్న బిసి సంక్షేమ సంఘం నాయకులు

ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ పల్లా భాస్కర్ తల్లి పల్లా లక్ష్మమ్మ(85) సోమవారం రాత్రి మృతి చెందారు. మంగళవారం కడప నగరం క్రిస్టియన్ లైన్‌లోని స్వగృహంలో ఆమె మృతదేహాన్ని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, ఉపాధ్యక్షులు సుంకేసుల ఖాదర్‌బాషా, నగరంలోని డాక్టర్లు గంజికుంట తిరుమలరావు, తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం నగర శాఖ అధ్యక్షులు కళ్యా సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా నరసింహారావు, ప్రధాన కార్యదర్శి సుంకర రామచంద్రుడు, కోశాధికారి టేకూరి సుదర్శన్, గౌరవాధ్యక్షులు డాక్టర్ గంజికుంట తిరుమలరావు, వేల్పుల ఉత్తన్న, పల్లా బాల చౌడన్న, పబ్బులేటి వెంకటరమణ సంఘం నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు.

పకడ్బందీగా 'ఇంటింటికీ కుష్టు సర్వే'

ప్రజాశక్తి-పెండ్లిమర్రి

జాతీయ కుష్టి వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈనెల 26 నుంచి జూలై 17 వరకు నిర్వహిస్తున్న ఇంటింటికీ కుష్టు సర్వే పకడ్బందీగా చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. మంగళవారం పెండ్లిమర్రి మండల పరిధిలోని నందిమండలం ప్రాథమిక వైద్యశాల పరిధిలో నిర్వహించిన ఇంటింటికి కుష్టు వ్యాధి సర్వే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నంది మండలం వైద్యాధికారి డాక్టర్ వినయ్ కుమార్ రెడ్డి, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటసుబ్బారెడ్డి, ప్రాథమిక వైద్యశాల సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యుత్ భవన్ ఎదుట ధర్నాచేస్తున్న కాంగ్రెస్ నాయకులు

విద్యుత్ భారాలు తగ్గించకపోతే ఆందోళన ఉధృతం

ప్రజాశక్తి - కడప

ట్రూ అప్ పేరుతో పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని లేనిపక్షంలో భవిష్యత్ కార్యాచరణ రూపొందించి అందరిని కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని ఎఐసిసి సభ్యులు బండి జకరయ్య, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్ హెచ్చరించారు. మంగళవారం కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్ నాయకత్వంలో పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ కడపలోని విద్యుత్‌భవన్ ఎదుట నిరసన ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలిచ్చి ఎడాపెడా విద్యుత్ ఛార్జీలు పెంచుతూ ప్రజలపై పెను భారాన్ని మోపుతున్నారు పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే 200 యూనిట్లు ఉచితంగా ఇస్తామని చెప్పి ఇటీవల ట్రూ అప్ ఛార్జీల పేరుతో రూ.1350 కోట్ల భారాన్ని మోపారని వాపో యారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అవ్వారు మల్లికార్జున, దస్తగిరిలతోపాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరి ప్రసాద్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మధు రెడ్డి, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్యామల దేవి, గౌరీ, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు గొర్ల శ్రీనివాసులు, ఆనంద్ పాల్గొన్నారు.

ఎన్నికల కో-ఆర్డినేటర్‌గా విజయ్ సుశీల్ కుమార్

ప్రజాశక్తి - కడప



తెలంగాణ రాష్ట్రంలో ఖైరతాబాద్, బంజారాహిల్స్, నాంపల్లి, అసెంబ్లీలకు ఎన్నికల కో-ఆర్డినేటర్‌గా జిల్లా వాసి నంది మండలం విజయ్ సుశీల్ కుమార్ నియమితులయ్యారు. ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆదేశాల మేరకు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా విజయ్ సుశీల్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన యూత్ కాంగ్రెస్ జాతీయ నాయకత్వానికి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌ఛార్జులు రక్ష రామయ్య, మమత నాగిరెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావుకు ధన్యవాదాలు తెలియజేశారు.

హెలన్ కెల్లర్ జయంతి వేడుకలు

కడప అర్బన్ : హెలన్ కెల్లర్ 143వ జయంతి వేడుకలు హెలన్ కెల్లర్ బధిరుల ఉన్నత పాఠశాల, జూని యర్, డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. హెలన్ కెల్లర్ సంస్థల కరస్పాండెంట్ డాక్టర్ పి.దౌలత్‌ఖాన్, ప్రిన్సిపల్ మసూద బేగం హెలన్ కెల్లర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బధిర విద్యార్థులు హెలన్ కెల్లర్ అంత టివారు కావాలని కోరారు. ఆత్మ స్థైర్యంతో ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఉపా ధ్యా యులు, శిక్షణలో ఉన్న ఉపాధ్యాయులు, బధిర విద్యార్థులు పాల్గొన్నారు.



హెలన్‌కెల్లర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కరెస్పండెంట్, ప్రిన్సిపల్

30న విద్యుత్ భవన్ వద్ద నిరసన : సిపిఎం

కడప అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజానీకం మీద పెద్ద ఎత్తున విద్యుత్ భారాలు మోపుతున్నాయని, వీటిని ప్రతిఘటించేందుకు ఈనెల 30న నగరంలోని మహావీర్ సర్కిల్ వద్ద వున్న విద్యుత్ భవన్ వద్ద ఆందోళన నిర్వహించనున్నామని సిపిఎం నగర కమిటీ సభ్యులు డి.ఎం. ఓబులేసు పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ధర్నా జయప్రదం చేయాలని ప్రజానీకాన్ని చైతన్యం చేస్తూ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీల భారం సామాన్య ప్రజానీకం భరించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యుత్ సంస్థను అదాని, అంబానికి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఇమామ్, ప్రభాకర్, రాము పాల్గొన్నారు.

నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలకు ఏ గ్రేడ్

కడప అర్బన్ : వైవీయూ పరిధిలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని నిలుకున్న నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల న్యాక్ ఏ గ్రేడ్ సాధించిందని ప్రిన్సిపల్ డాక్టర్ కె.సూర్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మే 29,30 తేదీల్లో న్యాక్ బృందం సందర్శించిందని పేర్కొన్నారు. ఏ గ్రేడ్ రావడం పట్ల కరస్పాండెంట్ బి.రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ బి.శివవిష్ణు మోహన్‌రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం హర్షం వెలిబుచ్చారని తెలిపారు.

టిడిపి నాయకుడి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కాశినాయన

బద్వేల్ నియోజకవర్గానికి చెందిన టిడిపి యువ నాయకుడు కర్నాటి వెంకటరెడ్డి జన్మదిన వేడుకలను బెంగళూరు పట్టణంలో మంగళవారం నిర్వమించారు. ముందుగా ఆయన్ను అబిమానులు శాలువతో సన్మానించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కలసపాడు, కాశినాయన, పోరుమామిళ్ల, అట్లూరు మండలాల నుంచి అభిమానులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

అంగన్వాడీ టీచర్లు, ఆయాల సమస్యలు పరి ష్కరించాలని మంగళవారం ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. భైరవ ప్రసాద్ మాట్లాడుతూ జులై 10,11 తేదీల్లో కడప కలెక్టరేట్ ఎదుట 36 గంటల దీక్షను జయప్రదం చేయాలని కోరారు. అంగన్వాడీలకు సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రూ. 26 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కేంద్రం అద్దెలు పెంచాలని, కూరగాయల బిల్లులు చాలా తక్కువగా ఇస్తున్నారని పేర్కొన్నారు. అంగన్వాడీ వర్కర్లపై వేధింపులు ఆపాలన్నారు. కొత్త సెంటర్లు ఏర్పా టు చేయకుండా వర్కర్లను బదిలీ చేయడం సరికాదన్నారు. 2017 సంవత్సరం నుంచి ఇప్పటివరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాని వారందరికీ వెంటనే ఇవ్వాలని జిల్లాలోని అనేక సెంటర్లకు గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐసిడి ఎస్ సిడిపిఒ ఎన్. లక్ష్మీదేవికి వినతి పత్రం అందజేశారు. కార్య క్రమంలో పోరుమామిళ్ల ప్రాజెక్టు పరిధిలోని టేకురుపేట సెక్టార్ లీడర్ దస్తగిరమ్మ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యురాలు విజయమ్మ, నారా యణమ్మ, లీలావతి ఫాతిమా, లావణ్య, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

ఇంటింటి సర్వే తనిఖీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని చిలమకూరు గ్రామంలో నిర్వహిస్తున్న కుష్టు వ్యాధిగ్రస్తుల ఇంటింటి సర్వేను జిల్లా అడిషనల్ డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ ఖాదర్‌వలి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేని పొడలు, ఎర్రని లేదా రాగి రంగు మచ్చలు కలిగి ఉంటే అది కుష్టు వ్యాధి కావచ్చునని తెలిపారు. ఈ వ్యాధికి ఎండిటి చికిత్స ఉందన్నారు. దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని ఆయన సూచించారు. ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు చేస్తున్న కుష్టు వ్యాధి సర్వేపై ఆరా తీశారు. సర్వేలో డాక్టర్ సాయిచరితరెడ్డి, ఆరోగ్య విద్యాధికారి నాగమునిరెడ్డి, ఎఎన్ఎం సరోజమ్మ, ఆశా కార్యకర్తలు భవాని, భారతి పాల్గొన్నారు.



సర్వేలో పాల్గొన్న అదనపు డిఎంహెచ్ఒ ఖాదర్‌వలి

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని టిడిపి పులివెందుల నియోజయవర్గ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రారెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని సాయికృష్ణా లే ఔట్‌లో టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన బ్యాటింగ్ ఆడి అక్కడ ఉన్నవారిని ఉత్సాహపరిచారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని వారిని అభినందించారు. ఈ సందర్భంగా రవీంద్రారెడ్డి మాట్లాడుతూ యువత ఆటల్లో రాణించేందుకు క్రికెట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమానికి పట్టణ అధ్యక్షుడు అన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దూరు వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి అజ్జగుట్టు రవితేజరెడ్డి, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అక్కులుగారి విజయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా మాజీ అధికార ప్రతినిధి భద్రరెడ్డి, పార్లమెంట్ తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగేశ్వర్ రెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, పులివెందుల నియోజకవర్గ యస్‌టి సెల్ అధికార ప్రతినిధి రఘు, నియోజకవర్గ టిడిపి అధ్యక్షుడు చిలకల మహేష్, టోర్నమెంట్ ఆర్గనైజర్ చిన్న, అన్నారెడ్డి విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతగా పిల్లలను పాఠశాలకు పంపించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పిల్లలను బాధ్యతగా పాఠశాలలకు పంపాలని ఎంఇఒ వీరారెడ్డి తల్లిదండ్రులను కోరారు. పట్టణంలోని సత్రం పాఠశాలలో మంగళవారం తల్లిదండ్రుల సమావేశాన్ని ఎంఇఒ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. జగనన్న విద్యా కానుకకు సంబంధించి తల్లిదండ్రులతో చర్చించారు. కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. అమ్మఒడి డబ్బులు త్వరలోనే తల్లి ఖాతాలో జమ అవుతాయన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ శైలజ, ప్రధానోపాధ్యాయుడు ఎసి గంగిరెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేంపల్లె : పాఠశాలలకు ప్రతి రోజూ విద్యార్థులను సక్రమంగా తల్లిదండ్రులు పంపాలని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నారాయణమ్మ కోరారు. పాఠశాలలో మంగళవారం ఆమె తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణమ్మ మాట్లాడుతూ విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టాలన్నారు. పాఠశాలలో జరిగిన పాఠాలు గురించి పిల్లలను తల్లిదండ్రులు అడుగుతూ ఉండాలని కోరారు. ఇంటి వద్ద కూడా వారు చదువుకొనే చూడాలని చెప్పారు. కార్యక్రమంలో సిఆర్పి ప్రకాష్, తెలుగు అధ్యాపకుడు చెరుకూరి శ్రీనువాసులు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మలేరియా రహిత సమాజమే లక్ష్యం

ప్రజాశక్తి - ఖాజీపేట

మలేరియా రహిత సమాజమే లక్ష్యంగా వైద్యసిబ్బంది, యంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు పనిచేయాలని ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఎస్.అయేషా సుల్తానా సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యాధికారి అయేషా మాట్లాడుతూ ప్రతి ఏడాది జూన్ 1 నుండి 30వ తేదీ వరకు ప్రపంచ మలేరియా వ్యతిరేక మాసోత్సవాన్ని జరుపుతారన్నారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించామన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఆ ప్రాంతాల్లో రసాయన మందులు పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారులు మాచనూరు రాఘవయ్య, బి.నాగభూషణం, ఆశ నోడల్ పర్సన్ అరుణకుమారి, సూపర్‌వైజర్స్ శోభన్‌బాబు, కృష్ణప్రియ, ల్యాబ్ టెక్నీషియన్ దుర్గా ప్రసాద్, హెల్త్‌అసిస్టెంట్లు విజయభాస్కర్, వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది నాగార్జున, శోభ, పద్మావతి పాల్గొన్నారు.

జీపు జాతాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

అంగన్వాడీ సమస్యలపై జులై 10,11తేదీల్లో కలెక్టరేట వద్ద జరిగే 36 గంటల దీక్షను విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. ఆ మేరకు జీపు జాతాను నిర్వ హిస్తున్నామని సిఐటియు కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు బి.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలకు సుప్రీంకోర్టు ఆర్డర్ ప్రకారం రూ.26,000 వేతనాలు ఇవ్వాలన్నారు. భవనం అద్దెలు పెంచాలన్నారు. కూరగాయల బిల్లులు కూడా పెంచాలన్నారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.లక్ష్మీదేవి, వి.భాగ్యమ్మ, సి.వి.రమాదేవి, లక్ష్మికళ, లక్ష్మికుమారి, సరస్వతి, భారతి, అంజనమ్మ, ముంతాజ్ బేగం, నాగమణి, మరియమ్మ, సుబ్బనరసమ్మ పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న యూనియన్ నాయకులు

ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు కొరత లేకుండా ఆర్‌బికెల్లో అందుబాటులో ఉంచాలని వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి సిబ్బందికి సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం ఎఒ క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న సందర్భంగా సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. ఎరువులు అమ్మిన వెంటనే డబ్బులు సంబంధిత ఏజెన్సీకి చెల్లించాలని సూచించారు. పిఎం కిసాన్ ఇకెవైసి 100 శాతం పూర్తి చేయాలన్నారు. మండలానికి చిరు సంచులు పథకం కింద కొర్రలు ఎస్ఐఎ 3156 రకం 100 కిట్లు 100శాతం ఉచితంగా ఇవ్వనున్నట్లు చెప్పారు. నువ్వులు 20 కిట్లు సాగు చేసే రైతులకు ఉచితంగా అందజేస్తామన్నారు. వేరుశెనగ పంట సాగుచేసే రైతులకు 40 శాతం రాయితీతో అందజేస్తామన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని ఎనమల చింతల గ్రామం వద్ద కుక్కల దాడిలో కృష్ణజింక మృతి చెందింది. అటవీ శాఖ అధికారి చంద్రశేఖర్ అందించిన వివరాల మేరకు.. యనమల చింతల గ్రామ పరిసరాల్లో నుండి మేత కోసం అటుగా వచ్చిన సుమారు నాలుగు నుండి ఐదు సంవత్సరాల వయసుగల కృష్ణజింకపై కుక్కలు దాడి చేశాయి. విషయం తెలుసుకున్న ముద్దనూరు అటవీశాఖ అధికారులు జింకకు ముద్దనూరు పశువైద్యశాల అధికారిచే పోస్టుమార్టం చేయించారు. అనంతరం జింకను ఖననం చేసినట్లు అటవీ శాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు.



మృతి చెందిన జింక

నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదు



నగరవనంలో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న పనుల్లో నాణ్యత లోపిస్తే ఉపేక్షించేదిలేదని కలెక్టర్ విజయ్‌రామరాజు, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. 29 పనులకు సంబంధించి దాదాపు రూ.639 కోట్లతో జరుగుతున్న పనులను మంగళవారం కలెక్టర్, ఎంపీ పరిశీలించారు. జులై 8న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల పర్యటనలో భాగంగా ప్రారంభించబోయే పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. పట్టణంలో రూ.13 కోట్లతో జరుగుతున్న పనులు, ఫిష్‌హబ్‌ను పరిశీలించారు. ఎంపీ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ పులివెందులను మోడల్ టౌన్‌గా మార్చే దిశగా ముఖ్యమంత్రి కోట్ల రూపాయలు విడుదల చేశారన్నారు. అధికారులు వేగవంతంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి మంగళవారం అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ పనులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్ రెడ్డి, కౌన్సిలర్ కిషోర్, నాయకులు, అధికారులు, పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే జగనన్న ధ్యేయం

వేంపల్లె : గ్రామ సమగ్రాభివృద్ధి, సంక్షేమమే జగనన్న ధ్యేయంగా పరిపాలన చేస్తున్నారని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో దాదాపు రూ.3 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు మంగళవారం ఎంపీ విచ్చేశారు. ముందుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో నిర్మించిన 6వ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే శ్రీచైతన్య స్కూల్ సమీపంలో నిర్మించిన రైతు భరోసా, 7వ సచివాలయం, ఎస్సీ కాలనీ సమీపంలో నిర్మించిన 1వ గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. అలిరెడ్డిపల్లె రహదారిలో ఉన్న పాపాఘ్ని నదిలో రజకుల కోసం రూ.10 లక్షలతో నిర్మించిన దోబిఘాట్‌ను కూడా ఎంపీ ప్రారంభించారు. దాదాపు రెండు కోట్లతో నిర్మించిన ఇండోర్ స్టేడియాన్ని కలెక్టర్ విజయ్‌రామరాజుతో కలిసి ఎంపీ ప్రారంభించారు. అక్కడ కొద్దిసేపు ఇండోర్ స్టేడియంలో సెటిల్ కలెక్టర్, ఎంపీ, జడ్పీటీసీ, సర్పంచు ఆడారు. కార్యక్రమంలో పులివెందుల ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, ఎపిఐఐసి డైరెక్టర్ చంద్రఓబుల్‌రెడ్డి, సివిల్ సప్లయ్ డైరెక్టర్ షబ్బీర్, కాణిపాకం దేవస్థానం డైరెక్టర్ గోగుల కొండయ్య, షాదీఖానా చైర్మన్ షేక్షావలి, హజ్ హౌస్ డైరెక్టర్ మునీర్, పిఆర్ డిఇ రవిచంద్రారెడ్డి, వ్యవసాయ శాఖ జిల్లా సంచాలకులు నాగేశ్వరరావు, పులివెందుల ఎడిఎ అశోక్ రెడ్డి, ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి, తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, అయ్యావారిపల్లి సర్పంచు రామగంగిరెడ్డి, ఎంపిటిసిలు బ్రహ్మయ్య, భారతి, కటిక చంద్రశేఖర్, రహంతుల్లా ఖాన్, వార్డు సభ్యులు ముత్యాల ఆంజనేయులు, సురేంద్ర, మటన్ బాబా, హకీం, రాచినేని వేణు, దేరంగుల రామాంజనేయులు, మురళి, జరిపిటి రవి, మండలస్థాయి అధికారులు, నాయకులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పనులు యుద్ధప్రాతిపదికన చేయాలి

పులివెందుల టౌన్ : పట్టణంలో జరుగుతున్న పనులను యుద్ధప్రాతిపదికతో చేయాలని కలెక్టర్ విజయ్‌రామరాజు ఆదేశించారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జులై 7,8 తేదీల్లో జిల్లాకు వస్తున్నారన్నారు. పనులు జులై 2 నాటికి పూర్తి చేయాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికలను రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పాడా ప్రత్యేక అధికారి అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్‌డిఒ వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎర్రమట్టి కుప్పలను తొలగించాలని వినతి



నిజాముద్దీన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆటోస్టాండ్ వద్ద ఉన్న ఎర్రమట్టి కుప్పలను తొలగించాలని సిఐటియు నాయకులు దాసరి విజయ్ కోరారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎఒ నిజాముద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ ఎర్రమట్టి కుప్పలను తొలగించాలని ఈ నెల 23న తహశీల్దార్ గుర్రప్పకు వినతి పత్రం అందజేసి, నిరసన చేపట్టినప్పటికీ స్పందనలేదన్నారు. ఎర్రమట్టి కుప్పల వల్ల ఆటో కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోలు రోడ్లపై ఉండడం వలన ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఆటోస్టాండ్ కోసం ఏర్పాటు చేసిన స్థలంలో ఎర్రమట్టి కుప్పలు ఉండడం వల్ల సమస్య ఏర్పడుతోందని వివరించారు. తక్షణం అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు దస్తగిరి, అబ్రహం, కిరణ్, రాజు, దివాకర్ పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని ఆటోస్టాండ్ వద్ద ఉన్న ఎర్రమట్టి వేయడం కారణంగా ఆటో కార్మికులకు తీవ్ర ఇబ్బందులు ఉన్నాయని, వెంటనే ఎర్రమట్టిని తొలగించాలని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరనాల శివనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక ఆటోస్టాండ్‌ను మంగళవారం ఆయన పరిశీలించి తహశీల్దార్ గుర్రప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివనారాయణ మాట్లాడుతూ ఆటో కార్మికులు ఎంతో కాలంగా ఆ స్థలంలో ఆటో నిలుపుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. కొద్దిరోజుల క్రితం ఆటోస్టాండ్‌లో అధికారులు ఎర్రమట్టి వేయడంతో ఆటోలు నిలుపుకోవడానికి స్థలంలేక రోడ్డుపై నిలుపుకుంటూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గతంలో ఇలా సమస్య వస్తే స్థానిక ఎమ్మెల్యే చొరవచూపి ఆటో కార్మికులకు యథా స్థలంలో ఆటోలు నిలుపుకునే దానికి సహకారం అందించారన్నారు. అధికారులు స్పందించి ఎర్రమట్టి కుప్పలు తొలగించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు దాసు, ఆటో వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, నరేంద్ర, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలి : ఆర్‌జెడి

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థులు ఉన్నత విద్యలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఆర్‌జెడి పి.బాబు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ వైఎస్ఆర్ వివేకానంద డిగ్రీ కళాశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అధ్యాపకుల సమావేశంలో బోధనపై చర్చించారు. అనంతరం విద్యార్థులతో కూడా చర్చించారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి మాట్లాడుతూ నూతన విద్యా విధానం అమల్లోకి వచ్చిన తర్వాత బోధనాపద్ధతులు, విద్యార్థులతో అనుసరించాల్సిన పరిస్థితులు మారాయన్నారు. కాలానుగుణంగా అధ్యాపకులు అనేక మార్పులు చేసుకోవాలన్నారు. విద్యార్థులకు ఉద్యోగ కల్పన చేయాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. ఎపి ఉన్నత విద్యాశాఖ అనేక అంతర్జాతీయ కంపెనీలతో ఎంఒయు కుదుర్చుకొని, దాదాపు 30 వేల మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నదని తెలిపారు. దానికి అనుగుణంగా విద్యార్థులలో నైపుణ్యాన్ని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, ప్లేస్‌మెంట్ అధికారి అరవింద్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి, బోధన సిబ్బంది కార్యదర్శి సుధాకర్, ఉమెన్స్ ఎన్‌పవర్‌మెంట్ కన్వీనర్ డాక్టర్ నాగలక్ష్మిదేవి, లైబ్రరీ మాధవరావు, ఐక్యు ఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ సతీష్, సీనియర్ అసిస్టెంట్ మహేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పూజారి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక చేయూత

ప్రజాశక్తి - దువ్వూరు

దువ్వూరు రామాలయం వీధికి చెందిన శివాలయం పూజారి కుటుంబానికి ఎమ్మెల్యే ఎస్. రఘు రామిరెడ్డి రూ. 50వేలు ఆర్థికసాయం చేశారు. గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్ర మంలో భాగంగా మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. పార్టీల కతీతంగా అర్హులకు ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. అక్కడ ఉన్న విద్యార్థులు పిలిచి మీరు బాగా చదువుకోవాలి.. జగనన్న మీకు ప్రతి సంవత్సరం అమ్మఒడి కార్యక్రమంలో భాగంగా నగదు రూపంలో మీ తల్లుల అకౌంట్లో డబ్బులు వేస్తున్నారన్నారు. కరోనాతో శివా లయం పూజారి, ఆయన కొడుకు మృతి చెందారు. ఈ విషయాన్ని పూజారి భార్య, కూతురు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. తాము చాల ఇబ్బంది పడు తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే రూ.50వేలు అందజేశారు. అక్కడే ఉన్న వైసిపి శ్రేణులు చందా రూపంలో రఘురామిరెడ్డి చేతుల మీదుగా రూ.2లక్షలు వారికి అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ రమాకుమారి, ఎంపిడిఒ జగదీశ్వర్‌రెడ్డి, ఎంపిపి కానాల జయచంద్రారెడ్డి, జడ్‌పిటిసి కృష్ణయ్య, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

అధిక ఫీజు వసూలుపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలో అధిక ఫీజు వసూలు చేస్తున్న ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బిసి విద్యార్థి ఫెడరేషన్ కోరింది. ఆ మేరకు నాయకులు మంగళవారం ఎంఇఒకు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి నారాయణ స్వామి మాట్లాడుతూ పులివెందుల పట్టణంలో పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి పేద, మధ్యతరగతి విద్యార్థి తల్లి దండ్రుల నుండి వేల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఈ రోజు పేదవారు ప్రయివేట్ పాఠశాలలకు పంపి చదివించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప ఏ ఒక్క పాఠశాలపై చర్యలు తీసుకోలేదన్నారు. ప్రభుత్వానికి విరుద్ధంగా నడుస్తున్న ప్రయివేట్ పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో చందు, సురేంద్ర, వంశీ పాల్గొన్నారు.

పాడి పశువుల గ్రౌండింగ్‌పైనే ప్రధాన దృష్టి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పాడి పశువుల గ్రౌండింగ్‌పైనే ప్రధానంగా దృష్టి పెట్టాలని పాడ ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో డిఆర్‌డిఎ పీడీ ఆనంద్‌నాయక్‌తో కలిసి నియోజకవర్గంలోని ఎంపిడిఒలు, ఎపిఎంలు, సిసిలు, డెయిరీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అమూల్ పాల రేటు పెంచిన విషయం పాడి పశువుల లబ్ధిదారులకు, ప్రజలకు తెలియజేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అన్ని గ్రామాలలోనూ గ్రామ సభలు పెట్టి రైతులను ప్రోత్సహించాలని సూచించారు. అలాగే పాత బిఎంసిలు, కొత్త బిఎంసిల ఆధారంగా మ్యాపింగ్ లు శుక్రవారం నాటికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. యువతకు ప్రోత్సాహకంగా బ్యాంకు రుణాలు ఇప్పించి మినీ డెయిరీలను ఏర్పాటు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో పిఆర్ ఇఇ ఓబుల్‌రెడ్డి, డిసిఒ సుభాషిని, ఏరియా కో- ఆర్డినేటర్ నీలకంఠారెడ్డి పాల్గొన్నారు.

నేడు సిబిఐటిలో యువ ఉత్సవ్


ప్రజాశక్తి - చాపాడు

భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో స్థానిక సిబిఐటి కళాశాలలో బుధవారం జిల్లాస్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వాగ్దాడం శివశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పంచ్‌ప్రాణ్ అఫ్ అమ్రిత్ కాల్ అనే అంశంపై పెయింటింగ్, కవితవ్యం, మొబైల్ ఫొటోగ్రఫీ, డిక్లేమసిన్ విభాగాల్లో వ్యక్తిగత, కల్చరల్ పోటీలు ఉంటా యని తెలిపారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసు కోవాలన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు.

'జగనన్న సురక్ష'తో పేదలందరికీ న్యాయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పేదలందరికీ న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. దొరసానిపల్లె పంచాయతీ పరిధిలో మంగళవారం ఆయన సర్పంచు ఈశ్వరమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ నాలుగేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలతో సువర్ణ పాలనను సాగిస్తూనే, మరోవైపు అర్హులను గుర్తించి వారికి మరిన్ని సేవలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టా రన్నారు. అర్హులకు ప్రతి పథకం అందాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ జేష్టాది శారద, ఎంపిపి శేఖర్ యాదవ్, ఎంపిటిసి మేరీ, ఉప సర్పంచు నారాయణరెడ్డి, పద్మశాలీయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయ లక్ష్మి, కల్లూరు నాగేంద్ర రెడ్డి, ఆనందరెడ్డి, కాకర్ల నాగశేషారెడ్డి, పోరెడ్డి నరసింహారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

దస్తగిరి కుటుంబానికి అండగా ఉంటా

చిన్నశెట్టిపల్లె గ్రామానికి చెందిన వాలంటీర్ దస్తగిరి కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. దస్తగిరి రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆయన స్పందించారు. చౌడూరు సమీపంలోని పూజ ఇంటర్నేషనల్ పాఠశాలలో దస్తగిరి పిల్లలు సాఫియాన్, ముత్తిజా సాధిఖ్ సిఫాజోయా చదువులకు అయ్యే ఖర్చులు తానే భరిస్తానని తెలిపారు. రూ.9.25 లక్షలు అందించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వారి కుమార్తె పెళ్లి ఖర్చులకుగానూ రూ.10 లక్షలు డిపాజిట్ చేస్తున్నానన్నారు. మొత్తం రూ.33 లక్షల రూపాయలు కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్నానన్నారు. ఎంపిపి శేఖర్ యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, కాకర్ల నాగశేషారెడ్డి, బండారు సూర్య నారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వీధుల్లో ఉన్న సిమెంట్ రోడ్లను ఆక్రమిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ వైస్‌చైర్మన్ వైస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. మున్సిపల్ అధికారులతో కలిసి మంగళవారం వారు వీధుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటి యజమానులతో మాట్లాడుతూ ఇళ్లకు సంబంధించిన మెట్లు సిమెంటు రోడ్డుపై లేకుండా చూసుకోవాలన్నారు. ఇంటి నిర్మాణంలోనే మెట్లను మీ స్థలంలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. రోడ్డును ఆక్రమిస్తే తొలగిస్తామని వారు హెచ్చరించారు. రోడ్డు ఆక్రమించి మెట్లు ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు.

ఖైదీల ఆరోగ్య భద్రతే ముఖ్యం

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ఖైదీల సంక్షేమం, ఆరోగ్య భద్రత ఎంతో ముఖ్యమని టి.బి. విభాగ సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ హుస్సేన్ అన్నారు. స్థానిక కారాగార ఆవరణలో మంగళవారం ఖైదీలకు ఆరోగ్య పరీక్షలు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలు తమ ఆరోగ్యం పట్ల చైతన్యవంతం కావాలన్నారు. ఆరోగ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదన్నారు. సబ్‌జైల్ పర్యవేక్షణ అధికారి సురేష్ మాట్లాడుతూ ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ నరేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు కారాగారంలోని ఖైదీలకు హెపటైటిస్-బి, సి., సిఫిలిసిస్, టి.బి., హెచ్ఐవి వ్యాధుల రక్తనమూనాలు సేకరించి పరీక్షించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్ బాలగంగిరెడ్డి, ఎల్.టి.గోవిందరెడ్డి, సబ్-జైలు సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను ప్రభుత్వం త్వరగా పూర్తి చేయాలని డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి నంద్యాల తులసిశ్వర్ యాదవ్, పట్టణ సహాయ కార్యదర్శి నాగేంద్ర కోరారు. పట్టణంలోని ప్రభుత్వ హై స్కూల్స్, కాలేజీల్లో జరిగే నాడు-నేడు పనులను మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభమైనా ఇంకా ఆ పనులు పూర్తి కాలేదన్నారు. నాడు-నేడు పనుల ద్వారా ప్రభుత్వ స్కూల్స్, కాలేజీలు అభివృద్ధి జరగడం మంచిదే.. కానీ సంవత్సరాల పొడువునా పనులు జరిగితే విద్యార్థులకు అసౌకర్యంగా ఉంటుందన్నారు.



అసంపూర్తి పనులను పరిశీలిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

అమ్మఒడి నిధులు మంజూరు

వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే అమ్మఒడి పథకానికి పులివెందుల నియోజక వర్గం పరిధిలో 23,562 మంది విద్యార్థులకు నిధులు మంజూరైనట్లు ఎంఇఒ వీరారెడ్డి తెలిపారు. పులివెందుల నియోజకవర్గంలోని చక్రాయపేట మండలంలో 2,765 మందికి, లింగాల మండలంలో 2,469, పులివెందుల మండలంలో 6,554, సింహాద్రిపురం మండలంలో 2,216, తొండూరు మండలంలో 1,830, వేముల 2,246, వేంపల్లె మండలంలో 5,482 మంది విద్యార్థుల తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలో అమ్మఒడి జమ అవుతుందన్నారు.